## ప్రజలకు ఎమ్మెల్యే పల్లా సంక్రాంతి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, జనవరి 14 : జనగామ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందరి జీవితంలో ఈ సంక్రాంతి నూతన కాంతి తీసుకురావాలని కోరారు. పాడి, పంటలతో రైతులు సుఖ, సంతోషాలతో జీవించాలన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సకుటుంబ సరివార సమేతంగా వేడుకలు జరుపుకోవాలని ఎమ్మెల్యే పల్లా ఆకాంక్షించారు.

బండా ప్రకాశ్‌తో ముదిరాజ్ సంఘం నాయకులు

## బండా ప్రకాశ్‌ను కలిసిన ముదిరాజ్‌లు

జనగామ రూరల్, జనవరి 14 : రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్‌ను ముదిరాజు సంఘం జిల్లా నాయకులు ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మత్స్య సహకార సంఘం జిల్లా చైర్మన్ నీల రాజు, డైరెక్టర్లు నిమ్మల స్వామి, చిక్కుడు రాములు, మారబోయిన సత్తయ్య, వద్ది వెంకటయ్య పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

## వైభవంగా గోదాదేవి కల్యాణం

పాలకుర్తి, జనవరి14: మండలంలోని వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరంగనాయక గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి తరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నర్మెటలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

## నర్మెటలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నర్మెట, జనవరి 14: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, సాయిబాబా దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్ ఆదివారం ప్రారంభించారు. జడ్పీ కోఆప్షన్ సభ్యుడి నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయడంతో వీటిని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, ఉపాధ్యక్షుడు చెప్యాల మహిపాల్ రెడ్డి, వార్డు సభ్యులు పొన్నం బాలకృష్ణ, మహేందర్, నాయకులు బెడుదం సుధాకర్, ఆమెడపు కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

బచ్చన్నపేట, జనవరి 14 : ఆయోధ్యలోని రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని మన్‌సాన్‌పల్లిలో ఆదివారం ప్రజాప్రతినిధులు ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ తారా శ్రీధర్‌గౌడ్, బీజేపీ నాయకులు గీస ప్రకాశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అం దించారు. ఈ నెల 22న అయోధ్యలో ప్రారంభమయ్యే రామమందిరం ఉత్సవాలకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్, శాకంపల్లి రవీందర్‌రెడ్డి, పొన్నం శ్రీకాం త్, పండుగ శ్రీకాంత్, సూరంపల్లి శ్రీనివాస్, కొమురెల్లి శ్రీనివాస్, చొక్కం మల్లేశం, పొన్నం రజినీకాంత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

కావలెను

★ రామప్ప జూనియర్ కళాశాల వంటశాలలో పని చేయుటకు భార్య భర్తలు లేదా స్త్రీ (4), పురుషులు (4) కావలెను. ఆకర్షణీయమైన జీతం+వసతి మరియు భోజనం. వెంటనే సంప్రదించవలసిన సెల్ నెం.: 9985299479.
NTW-13590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## గంజాయి సరఫరాదారుడి అరెస్ట్

జనగామ చౌరస్తా, జనవరి 14 : మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న గంజాయి సప్లయర్‌ను అరెస్ట్ చేసినట్లు ఆదివారం జనగామ అర్బన్ సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపారు. స్థానిక గిర్నిగడ్డ ఏరియాకు చెందిన కోల సాయి శివ గంజాయి కేసులో నిందితుడిగా ఉండి పోలీసులకు చిక్కికుండా తప్పించుకు తిరుగుతున్నాడని పేర్కొన్నారు. శనివారం జనగామ చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి నిందితుడు శివ పారిపోతుండగా పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# భక్తుల కొంగు బంగారం..

- కోరిన కోర్కెలు తీర్చే ఆలేటి ఎల్లవ్వ
- నేటి నుంచి బమ్మెర శివారులో జాతర
- అమ్మవారికి బోనాలు, పట్నాలు
- వేలాదిగా తరలి రానున్న భక్త జనం

పాలకుర్తి, జనవరి 14 : కోరిన భక్తులకు కొంగు బంగారంగా వెలుగొందుతున్న ఆలేటి ఎల్లవ్వ తల్లి జాతర వైభవంగా జరుగనున్నది. పాలకుర్తి మండలం బమ్మెర శివారు ఎల్లమ్మగడ్డ తండా శివారులోని అమ్మవారి ఆలయం వేడుకలకు ముస్తాబైంది. నల్గొండ జిల్లా ఆలేరు నుంచి వచ్చిన అమ్మవారు బమ్మెర శివారులో స్థిరపడ్డారని గ్రామస్తులు చెబుతుంటారు. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి మరుసటి రోజు జరిగే కనుమ రోజు ఉత్సవాలను ఘనంగా జరుపుతారు. ఈ నెల 15న బండ్లు తిరుగుట,16న ఆలేటి ఎల్లవ్వకు బోనాలు, పట్నాలు సమర్పిస్తారు. గ్రామ దేవతల్లో ఒక్కటైన ఎల్లవ్వను దర్శించుకునేందుకు ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. పిల్లలు లేనివారు అమ్మవారిని దర్శించుకొని ఆలయ సమీపంలోని తాటిచెట్టు వద్ద వ్రతం పడితే సంతానం కలుగుతుందని విశ్వాసం. జాతర సందర్భంగా డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సవాలు జరుగుతాయి. ఆలయానికి సమీపంలోని చెరువుకు ఎల్లమ్మ చెరువుగా, ఇక్కడి తండాను ఎల్లమ్మగడ్డ తండాగా పిలుస్తున్నారు. ఎల్లవ్వకు కోడిపుంజులు, మేకపోతులను బలివ్వడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ జాతర మినీ మేడారాన్ని తలపించనున్నది. ఎడ్ల బండ్ల ప్రభలతో భక్తులు తరలిరావడం చూపరులను ఆకట్టుకుంటుంది. ఉత్సవాల నిర్వహణకు ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

జాతరకు ముస్తాబు చేస్తున్న ఆలేటి ఎల్లవ్వ ఆలయం

### కాలి నడకన తరలి రానున్న భక్తులు ..

అలేటి ఎల్లవ్వ జాతరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కాలినడకన తరలిరానున్నారు. మరికొందరు ఎడ్లబండ్లలో రానున్నారు. పాలకుర్తి ,బమ్మెర ,తొర్రూరు ,తీగారం, విస్నూర్, లక్ష్మీనారాయణపురం, ఈరవెన్ను, కోతులాబాద్, గ్రామాల నుంచి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో కాలినడకన వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

### తాటిచెట్టుపై పసుపు, కుంకుమ

సంతానం లేని వారు అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న తాటి చెట్టుకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే తాటి చెట్టు పైనుంచి గవ్వలు పసుపు, కుంకుమ, ముద్దలు కిందకు పడుతాయని భక్తుల విశ్వాసం ఆలేటి ఎల్లవ్వను దర్శించుకునేందుకు తాటి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. మరికొందరు ప్రదక్షిణ చేస్తూ మొక్కులు చెల్లిస్తారు. అమ్మవారి ఆలయంలో ఉన్న తాటిచెట్టును గీయకుండా కొంత కాలంగా గీత కార్మికులు అమ్మవారికే అప్పగించారు.

ఆలయంలో కొలువైన అమ్మవారు

### జాతరకు హాజరు కానున్న ప్రముఖులు

ఆలేటి ఎల్లవ్వ జాతరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి హనుమాన్ల ఝాన్సీరెడ్డి , వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు.

# ముగిసిన సీనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు

- జనగామలో హోరాహోరీగా తలపడిన జట్లు
- తెలంగాణ మహిళ ల జట్టుకు ట్రోఫీ
- పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు గెలుపు

జనగామ చౌరస్తా, జనవరి 14 : దక్షిణాది రాష్ట్రాల 20వ సీనియర్స్ సాఫ్ట్ బాల్ ఫైనల్స్ మ్యాచ్‌లో తెలంగాణ మహిళా జట్టు కేరళపై 6-5 స్కోరుతో విజేతగా నిలిచింది. పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు తెలంగాణపై 10-0 స్కోరుతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పాఠశాల మైదానంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు క్రీడలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి 224 మంది క్రీడాకారులతో పాటు 28 మంది కోచ్‌లు క్రీడలకు హాజరయ్యారు. చివరి రోజు ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్ మహిళల విభాగంలో తెలంగాణ వర్సెస్ కేరళ జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. తెలంగాణ జట్టు విజయం సాధించగా, కేరళ ద్వితీయ స్థానం, ఆంధ్ర ప్రదేశ్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు గెలుపొందగా, తెలంగాణ ద్వితీయ, కేరళ తృతీయ స్థానంలో నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పీ సాంబశివరావు, విశిష్ట అతిథులుగా లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ డీ లవకుమార్‌రెడ్డి, అర్బన్ సీఐ ఎలబోయిన శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టు

## గ్రామ దేవతలకు ఘనంగా పూజలు

### బోనాలతో మొక్కులు చెల్లించిన భక్తులు

లింగాలఘనపురం, జనవరి 14 : మండల కేంద్రంతో పాటు నెల్లుట్లలోని గౌడ కులస్తులు తమ ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామి, మల్లికార్జునస్వామికి ఆదివారం పూజలు చేసి బోనాలు సమర్పించారు. ప్రతిఏటా సంక్రాంతి పర్వదినం భోగి రోజు నెల్లుట్లలో కంఠమహేశ్వరస్వామికి బోనాలు సమర్పించి తమ పిల్లాపాపలు, గొడ్డూ గోదా, వృత్తి వ్యాపారాలను కాపాడాలని స్వామివారిని వేడుకున్నారు. నెల్లుట్లలో జరిగిన కార్యక్రమంలో కుల పెద్దలు కొయ్యడ చంద్రయ్య, కొయ్యడ రామలింగం, బెల్లంకొండ సోమనాథం, బత్తిని భిక్షపతి, అంబాల యాదగిరి, గుర్రం బాలరాజు గౌడ్, మాచర్ల మహేశ్, చినసోమయ్య తదితరులు పాల్గొన్నారు. మరోవైపు లింగాలఘనపురంలోని మల్లన్న మర్రివద్ద ఉన్న మల్లికార్జునస్వామి దేవాలయాన్ని మూడేళ్ల క్రితం పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఏటా బోనాలు సమర్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బోయిని శివాలు స్వామి, బెజ్జం ఆంజనేయులు, ఎడ్ల తిరుపతి, బోయిని జంపి, బోయిని వీరస్వామి, బెజ్జం చంద్రయ్య, బోయిని శివకృష్ణ, ఎడ్ల మల్లేశం పాల్గొన్నారు.

బచ్చన్నపేట జట్టుకు బహుమతి ఇస్తున్న ప్రజాప్రతినిధులు

లింగాలఘనపురం : క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎస్సై ప్రవీణ్

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట, జనవరి 14 : విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లగోని పుష్పా బాలకిషన్‌గౌడ్, కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, ప్రగతి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు పోచంపల్లి శ్రీనివాస్ అన్నారు. కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో బచ్చన్నపేటలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. 26 జట్లు క్రీడల్లో పాల్గొనగా, బచ్చన్నపేట జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో పోచన్నపేట, మూడో స్థానంలో కొడవటూరు, నాలుగో స్థానంలో బచ్చన్నపేట బీ టీమ్ నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ప్రథమ విజేత జట్టుకు రూ.6 వేలు, ద్వితీయ రూ.4 వేలు, తృతీయకు రూ.3 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2 వేల నగదుతో పాటు మెమెంటో అందించారు.

రఘునాథపల్లి : క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు

### లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : క్రీడలతో యువతలో క్రమశిక్షణ, స్నేహభావం అలవడుతుందని ఎస్సై ప్రవీణ్ అన్నారు. ఆదివారం లింగాలఘనపురంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని కోరారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్‌లో విజయానికి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదం విజయమనోహర్, ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, ఉపసర్పంచ్ కేమిడి కవితావెంకటేశ్, నాయకులు కేమిడి యాదగిరి, మల్ల శ్రీశైలం, గవ్వల మల్లేశం, కొత్తకొండ గంగాధర్ పాల్గొన్నారు.

### రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : ఆటల పోటీలు క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడుతాయని సర్పంచ్ గొరిగె భాగ్య-రవి అన్నారు. మండలంలోని భాంజీపేటలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చెరుకు ఐలోని, మెరుగు రమేశ్ జ్ఞాపకార్థం క్రికెట్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ క్రీడల్లో యువత ప్రతిభ కనపర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రచ్చ సోమనాథ్, మాజీ సర్పంచ్ గైని శ్రీనివాస్, నాయకులు పబ్బ మధు, గైని రమేశ్, చెరుకు లింగం, శ్రీనివాస్, చెరుకు భిక్షపతి, పరమేశ్, కన్న రాజు పాల్గొన్నారు.

సూర్యాపేట జట్టుకు బహుమతి ఇస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి ● కబడ్డీలో విజేతలకు బహుమతులు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 14 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చాగల్లులో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మూడు రోజులు నిర్వహించిన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ పోగుల సారంగపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజేతలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి పొందిన సూర్యాపేట జట్టుకు రూ.60 వేలు, ద్వితీయ బహుమతి జనగామ జట్టుకు రూ.50 వేలు, తృతీయ బహుమతి హనుమకొండ జట్టుకు రూ.30 వేలు, నాలుగో బహుమతి పొందిన చాగల్ జట్టుకు రూ.20 నగదు, షీల్డులను అందించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్వహించే క్రీడలకు కడియం ఫౌండేషన్ తనవంతు సహకారం అందిస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాఠశాలల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి యువతను భాగస్వాములను చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, సర్పంచ్‌లు కోతి రాములు, ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గన్ను నర్సింహులు, వెంకటస్వామి, చాగల్లు ఉప సర్పంచ్ రజితా రాజేశ్, కనకం రమేశ్, చేపూరి ప్రభాకర్, అంబటి కిషన్‌రాజు, జీడి రమేశ్, పల్లె రవి, మంద రాజు, మందపురం ఎల్లగౌడ్, సెల్ కొమురయ్య, చిగురు సరిత, మాజీ సర్పంచ్ హిమబిందు, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

సత్యనారాయణ (ఫైల్)

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 14 : మండలంలోని మీదికొండకు చెందిన ఆటో డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మీదికొండకు చెందిన వేముల సత్యనారాయణ(55)కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇతడికి ఎలాంటి ఆస్తులు లేవు. ఆర్థిక ఇబ్బందులతో కూతుళ్ల పెళ్లి చేయలేదు. ఈ నేపథ్యంలో గుండెపోటుతో సత్యనారాయణ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్తులు తెలిపారు.

### ఆటో డ్రైవర్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని పలువురు ఆరోపించారు. పండగ పూట కూడా ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలనే ఆవేదనతో సత్యనారాయణ గుండెపోటుకు గురై మృతి చెందాడని వారు తెలిపారు. అతడి మృతికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని మీదికొండ ఆటో యూనియన్ అధ్యక్షుడు మంద ఎల్లస్వామి, స్టేషన్ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు గుర్రం మధుమోహన్, గౌరవాధ్యక్షుడు జయపాల్ డిమాండ్ చేశారు.

## 'చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యం పెంచాలి'

పాలకుర్తి, జనవరి 14: బీసీలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ఆల్ ఇండియా ఓబీసీల జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. బహుజన కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య అధ్యక్షతన ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధపోరాటయోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. నరేందర్ మాట్లాడుతూ వీరుల స్ఫూర్తిగా అన్నివర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పాలకులను కోరారు. బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు మాట్లాడుతూ బీసీలకు వాటా ఇచ్చినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చపార్తి కుమార్‌గాడ్గే, సంగి వెంకన్న, ఓబీసీల సంఘం రాష్ట్ర నాయకుడు పులి గణేశ్‌గౌడ్, రజక సంఘం నాయకుడు మదార్, చిట్యాల సమ్మయ్య, సోమయ్య, పోశాల వెంకన్న, శ్రీనివాస్, వీరమల్ల రాజు, వెంకటేశ్వర్లు, ఎడవెల్లి సోము పాల్గొన్నారు.

# ఘనంగా భోగి వేడుకలు

- సంక్రాంతి పర్వదినాన ఇళ్ల ఎదుట రంగవల్లులు
- జిల్లాలో పలు చోట్ల ఆటల పోటీలు
- సందడిగా మారిన గ్రామాలు

జనగామ రూరల్, జనవరి 14: సంక్రాంతి పర్వదిన వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాలు, పట్టణాల్లో భోగి పండుగ ఉత్సాహంగా జరిగింది. ఆడబిడ్డలు తెల్లవారుజామునే లేచి ఇళ్లముందు రంగురంగుల ముగ్గులు వేశారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు పేర్చి నవధాన్యాలు, రేగుపండ్లతో ఆలంకరించారు. గొల్లకుర్మల ఇష్ట దైవమైన మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజాలు చేసి మొక్కులు చెల్లించారు. చౌడారంలో లయన్స్‌క్లబ్ జనగామ బిబాయిజ్ ఆధ్వర్యంలో చెరుకూరి వెంకటేశ్ సౌజన్యంతో ముగ్గులతోపాటు కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు లయన్స్ మాజీ గవర్నర్ కన్న పరశురాములు బహుమతులు అందజేశారు. మండల ప్రజలకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

### నర్మెటలో..

నర్మెట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో భోగి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం మహిళలు తమ ఇళ్ల ముందు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. అందులో గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలతో అలంకరించారు. పిండి వంటల తయారీలో మహిళలు తలమునకలయ్యారు. పట్టణాల్లో ఉంటున్న అనేక మంది స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.

### బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నరామన్‌చర్లలో జాగృతి మాజీ మండల అధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డి నేతృత్వంలో సంక్రాంతి ముగ్గులు వేశారు. మండలవాసులకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి, చంద్రారెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, పూర్ణచందర్, నరేందర్, సతీశ్‌రెడ్డి, కనకయ్యగౌడ్, నల్లగోని బాలకిషన్ గౌడ్, నిడిగొండ శ్రీనివాస్, పంచ వెంకట్‌రెడ్డి, కోడూరి మహాత్మాచారి, ఆల్వాల ఎల్లయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బల్లెపు వేణువందన శుభాకాంక్షలు తెలిపారు.

### మైసూరులో సంక్రాంతి సంబురాలు

లింగాలఘనపురం : మండలానికి చెందిన కొందరు ఇటీవల కర్ణాటక రాష్ట్రానికి విహారయాత్రకు వెళ్లారు. ఈ క్రమంలో మైసూరులో ఆదివారం బస చేయాల్సి రావడంతో అక్కడే సంక్రాంతి భోగి సంబురాలు జరుపుకుని తెలంగాణ సంప్రదాయాన్ని చాటారు. కార్యక్రమంలో పాషికంటి యాదగిరి, మర్యాల రమేశ్, బుర్ర రమేశ్, గణేశ్, భాస్కర్, నవీన్, పద్మ, రజిని, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్ : సిద్దెంకిలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న కుటుంబం

లింగాలఘనపురం : మైసూరులోని హోటల్ ప్రాంగణంలో భోగి వేడుకల్లో స్థానికులు